కథ

# మనో 'గ్రహణం'

మదన్ మోహన్ రావు.ఎమ్

ఆఫీసులో చాలా బిజీగా వున్నాను. సంతకాలు చెయ్యాల్సిన కాగితాలు యింకా చాలా వున్నాయి. రేపే టూర్ వెళ్ళాలి. సంతకాలు చేస్తూనే వున్నాను. ఓ చోట 'ప్రిన్సిపాల్' అనే స్టాంప్‌కి బదులుగా 'డిస్పాచ్‌డ్' అనే స్టాంపు వేసి వుంది. అసలే చికాగ్గా వున్నానేమో, అది చూసి చిర్రెత్తుకొచ్చింది. కాలింగ్ బజర్ కసిగా నొక్కాను.

అటెండర్ వెంకటేశం ఆదరాబాదరా పరిగెత్తుకువచ్చి, చేతులు కట్టుకుని నిల్చున్నాడు. సిగరెట్టో, బీడీయో పారేసి వచ్చాడేమో వాసన గుప్పుమంటోంది.

'యములాడిలా తగిలాడురా నాయనా! కాస్త బీడీ అన్నా కాల్చుకోనియ్యడు. ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందో కానీ..'

ఆవేశంతో కళ్ళెర్రజేసి, పళ్ళు పటపట కొరుకుతూ, ఉగ్ర నరసింహుడిలా అతనికేసి చూసాను. ఆశ్చర్యం! అతనేమీ మాట్లాడటం లేదు.

మరి నాకు ఆ మాటలు ఎట్లా వినిపించాయి? అతను మనసులో అనుకున్నది నేను గ్రహించ గలిగానా? అయితే ఎట్లా గ్రహించగలిగాను? ఇన్నాళ్ళు లేనిది ఆకస్మికంగా యిప్పుడే ఎలా వచ్చింది ఆ శక్తి? అంతా చిత్రంగా వుంది.

ఎలాగో సంబాళించుకొని 'అతని సంగతి తర్వాత చూద్దాం' అనుకుని, ''ఆ సీనియర్ అసిస్టెంట్ గుర్నాధంగారిని యిట్లా రమ్మను. అర్జంట్'' అన్నాను విసుగ్గా, కోపాన్నంతా వెళ్ళగక్కుతూ.

''పిలిచారా సార్?'' అంటూ వచ్చాడు గుర్నాధం.

'లేదు అరిచాను' అందామనుకున్నాను. కానీ అంత లోనే

'....అసలే యింటావిడతో దెబ్బలాడి వచ్చాను. ఏం పొరపాటు జరిగిందో ఏమో? ఇంట్లో ఆ మొగుడు, కాలేజీలో యీ మొగుడితో వేగలేక చస్తున్నాను. పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసానో కాని యివ్వాళ నా ఖర్మ కాలింది..' అన్న మాటలు వినిపించాయి.

అయితే ఈసారి ఆశ్చర్యం కలుగలేదు.

అంటే నేను యితనికి మొగుణ్ణా?! నన్ను చూడటం ఖర్మ కాలడమా? విపరీతమైన కోపం వచ్చింది. ఎట్లాగో తమాయించుకున్నాను. అతడు చేసిన తప్పు ఏమిటో చూపించాను.

'ఈ అటెండర్ వెధవ బాగానే దొరికాడు. ఒక స్టాంపు వెయ్యమంటే మరో స్టాంపు వేసి నా పీకల మీదికి తెచ్చాడు. వాడి తప్పుకి నేను శిక్ష అనుభవించాలి. నోరు మెత్తని వాణ్ణి చూస్తే అందరికీ లోకువే'

''పొరపాటయింది సార్. పని తొందరలో చూసుకోలేదు..'' అంటూ ఏమిటో చెబుతున్నాడు గుర్నాధం.

ఈయన మెత్తని వాడని నేను మొత్తిందేమి వుందబ్బా, అంత దుర్మార్గుణ్ణా నేను?

''అలా చూడకుండా బాధ్యతా రహితంగా ప్రవర్తించడం నాకు నచ్చదు. ఇక ముందు జాగ్రత్తగా వుండండి'' అని వార్నింగ్ యిచ్చాను.

కిమ్మనకుండా వెళ్ళిపోతున్నాడు గుర్నాధం.

'ఏ జన్మలో ఏం పాపం చేసానో ఈ జన్మలో యీ రాక్షసుడి కింద పని చేయాల్సి వచ్చింది' అని తిట్టుకుంటూ.

ఇతరులు మనసులో ఏమనుకుంటున్నారో గ్రహించే శక్తి ఎట్లా వచ్చిందో కానీ అది నా పాలిట ఓ శాపంలా మారింది. మనసంతా చికాగ్గా, తిక్కగా వుంది.

అంటే నేను యములాడినీ, రాక్షసుణ్ణీనా, వాళ్ళిద్దరే యిట్లా అనుకుంటున్నారంటే, మిగతా వాళ్ళు ఏమనుకుంటున్నారో?

ట్రింగ్..ట్రింగ్..మంటూ ఫోన్ రింగయింది.

''నమస్కారం సార్..నేను రామలింగయ్యను..తమతో అర్జంటుగా మాట్లాడాలి. రమ్మంటారా?''

''రమ్మనకుంటే వూరుకుంటావా?''

''రండి'' అంటూ ఫోన్ పెట్టేసాను. ఆయన కూడా నా గురించి ఏమనుకుంటుందీ తెలుసుకోవచ్చని.

కొంచెం సేపు అయ్యాక వచ్చాడు రామలింగయ్య. చిన్నపాటి రాజకీయ నాయకుడు.

''సార్ మా బామ్మర్ది తోడల్లుడి తమ్ముడు టి.శంకరయ్యకు ఇంటర్ సైన్స్ గ్రూపులో సీటు దొరకదని తమరు రిజెక్ట్ చేసారట. ఎలాగైనా యిప్పించాలి మరి'' ప్రాధేయపడుడూ అడిగాడు రామలింగయ్య.

'ఎవడికోసం యిప్పిస్తాడు. ఇప్పించకపోతే యీ వూళ్ళో మనను కాదని ఉద్యోగం చేయడం యీయన అబ్బతరమా?'

''కుర్రాడికి తగినన్ని మార్కులు రాలేదు. అయినా చూద్దాంలెండి'' అన్నాను, కోపాన్ని దిగమింగుకుంటూ.

''చూద్దామంటే కాదు. చేద్దాం అనండి''

''చూద్దామన్నానుగా'' విసుక్కున్నాను.

''తవరి దయ'' అంటూ సెలవు తీసుకున్నాడు.

'బోడి ప్రిన్సిపాల్ కాగానే వినికేం గర్వమొచ్చింది?' అనుకుంటూ.

''మే ఐ కమిన్ సార్?'' అంటూ వచ్చింది స్టెనో దమయంతి.

మనిషి చాలా అందంగా, అప్ టు డేట్‌గా వుంటుంది. తాను చాలా అందంగా వుంటుందని ఆమెకు ఓవర్ కాన్ఫిడెన్స్.

ఆమెతో పాటే సువాసన కూడా లోపలికి వచ్చి గది నిండా అలుముకుంది.

ఏదో ఆలోచిస్తూ ఆమెనే చూస్తున్నాను.

'ఛీ! ఛీ! అట్లా చూస్తాడేం సిగ్గులేకుండా?'

ఉలిక్కిపడి సర్దుకుని, గబగబా నాలుగు లెటర్లు డిక్టేట్ చేసి, ఆమెను పంపించి వేసాను.

తలంతా దిమ్ముగా వుంది. అటెండర్‌తో కాఫీ తెప్పించుకుని త్రాగి, కొంచెం సేపు రిలాక్స్ అయ్యాను.

ప్రొద్దుట నించి జరుగుతున్న సంఘటనలు చిత్రంగా వున్నాయి. ఈ అనుభవం థ్రిల్లింగ్‌గానూ వుంది.

సీనియర్ లెక్చరర్ అలా వెళ్తూ లోనికి తొంగి చూసాడు.

''కమిన్'' అన్నాను-అతని అభిప్రాయం కూడా తెలుసుకుందామని.

వచ్చి, విష్ చేసి కూర్చున్నాడు.

తల గిర్రున తిరిగింది. ఎవరితో మాట్లాడుతామన్నా దడగా వుంది. భగవాన్ నాకీ శక్తినెందుకిచ్చావ్? నన్నెందుకిట్లా పరీక్షిస్తున్నావు? నా చుట్టూ వుండే వాళ్ళంతా మనసులో ఏమనుకుంటున్నది తెలుసుకుని ఎలా తట్టుకోగలను? ఒక అయిదుగురి మనసు తెలుసుకుంటేనే యింత నరకయాతనగా వుంది, యింక ప్రతి ఒక్కరి మనసు తెలుసుకుంటే నేనెట్లా జీవించటం? ఏడుకొండలుతో ఏమీ అనకుండా, నేనే కారు తీసుకుని బయలుదేరాను. నున్నటి రోడ్డుపై కారు వేగంగా జారి పోతుంది. అంతకన్నా వేగంగా నా చెవుల్లో యితరుల మనో భావాలు గింగురుమంటున్నాయి.

విద్యార్థుల గురించి, లెక్చెరర్ల గురించి, కాలేజీ విషయాల గురించి, త్వరలో జరగబోయే 'ఇనాగరల్ ఫంక్షన్'కు ఎవరెవరిని ఆహ్వానించాలి, ఏయే ఏర్పాట్లు చెయ్యాలో చర్చించాము. ప్రతీ దానికీ ఆయన ముభావంగా ఏదో సమాధానం చెప్తున్నాడు.

అకస్మాత్తుగా 'దుర్మార్గుడు. నాకు రావాల్సిన ప్రమోషన్ కొట్టేసాడు. వీడేం బాగుపడతాడులే' అని వినిపించింది.

వెంటనే సంభాషణ ఆపి, అతణ్ణి పంపించేసాను. ఓహో అదన్నమాట ఆయన ఆలోచన.

ఇంతలో బయట ఏదో కలకలం వినిపించింది.



''ఏమిటా?'' అని బయటికి వచ్చి చూసాను. అప్పుడే పీరియడ్ అయిపోయినట్టుంది. స్టూడెంట్స్ అంతా వరండాలో చేరి గుంపులు గుంపులుగా కూడి, అల్లరిగా మాట్లాడుకుంటున్నారు. యూనియన్ లీడర్ మధు కూడా వున్నాడు-అమ్మాయిలతో గోలగోలగా మాట్లాడుతూ.

నన్ను చూస్తూనే అంతా ఎవరి రూంలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. మధుసూదన్ మాత్రం నిర్లక్ష్యంగా ఎవరో అమ్మాయితో మాట్లాడుతున్నాడు.

''మిస్టర్ మధు'' పిలిచాను.

'శుక్రాచార్యుడిలా దాపురించాడు'

ఆ అమ్మాయితో ఏదో చెప్పి, ఆమె వెళ్ళిపోయాక వచ్చాడు.

''ఏం సార్!'' అన్నాడు వినయంగా, దగ్గరికి వచ్చి.

''క్లాస్ లేదా?''

''ఉంది సార్. వెళ్తున్నా'' అంటూ వెళ్ళిపోయాడు.

ఇంక లాభం లేదు బయటికెళ్దాం అనుకుని డ్రైవర్‌ను కేకేసాను.

డ్రైవర్ ఏడుకొండలు-స్వీపర్ రత్తాలుతో మాట్లాడుతున్నవాడల్లా కంగారుగా వచ్చాడు...'ఎవడ్రా వాడు..పానకంలో పుడకలా..ఓ యాళా లేదు..పాళా లేదు..ఎప్పుడు పడితే అప్పుడే కేకేయటం..యీడి పని ఎప్పుడో పడతా..'

తల గిర్రున తిరిగింది. ఎవరితో మాట్లాడుతామన్నా దడగా వుంది. భగవాన్ నాకీ శక్తినెందుకిచ్చావ్? నన్నెందుకిట్లా పరీక్షిస్తున్నావు? నా చుట్టూ వుండే వాళ్ళంతా మనసులో ఏమనుకుంటున్నది తెలుసుకుని ఎలా తట్టుకోగలను? ఒక అయిదుగురి మనసు తెలుసుకుంటేనే యింత నరకయాతనగా వుంది, యింక ప్రతి ఒక్కరి మనసు తెలుసుకుంటే నేనెట్లా జీవించటం?

ఏడుకొండలుతో ఏమీ అనకుండా, నేనే కారు తీసుకుని బయలుదేరాను. నున్నటి రోడ్డుపై కారు వేగంగా జారి పోతుంది. అంతకన్నా వేగంగా నా చెవుల్లో యితరుల మనోభావాలు గింగురుమంటున్నాయి.

'యములాడిలా తగిలాడురా నాయనా!'

'ఆఫీసులో యీ మొగుడు..ఇంట్లోఆ మొగుడు..రాక్షసుడు!'

'బోడి ప్రిన్సిపాల్ కాగానే వీడికేం గర్వమొచ్చింది!'

'ఛీ! ఛీ అట్లా చూస్తావేం సిగ్గులేకుండా!'

'దుర్మార్గుడు నా ప్రమోషన్ కొట్టేసాడు!'

'శుక్రాచార్యుడిలా దాపురించాడు!'

'నాయాల..యీడి పనెప్పుడో పడతా!'

వాళ్ళంతా నా చుట్టూ చేరి గందరగోళంగా అరుస్తున్నట్టుగా వుంది. ఏమీ తెలియడం లేదు. అయోమయంగా వుంది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపలే నా కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. స్టీరింగ్ వీల్ బలంగా నా ఛాతికి గుద్దుకుంది.

'కెవ్వు'న కేకవేసాను బాధగా.

''ఏమిటండీ అట్లా గుండెలదిరేలా కేకేసారు..ఎంత భయపడిపోయాను'' అంటూ లేపింది శ్రీమతి ఉషారాణి. పిల్లలు వంశీమోహన్, కృష్ణమోహన్ బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు.

నేను...నేను...ఎక్కడున్నాను? ఇంట్లోనా? మరి కారు..? ఏక్సిడెంట్..కేకలు..అరుపులు..యితరులు మనసులో అనుకునేది గ్రహించటం..అంతా కలేనా?..అయితే బ్రతికాను, లేకుంటే చచ్చేవాణ్ణి!

'ఏమిటీయన వెర్రివాడిలా చూస్తాడు?' ఉషారాణి.

అయితే యీసారి ఆమె మనసులోని భావం నేను గ్రహించలేదు. ఊహించాను అంతే!

★